వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ చింతమనేని శ్రీనివాస్

నార్సింగిలో డ్రగ్స్ పట్టివేత

నైజీరియన్ సహా మరో ఇద్దరు అరెస్ట్

సిటీబ్యూరో, జూన్ 23 (నమస్తే తెలంగాణ)/బండ్లగూడ : విదేశాల నుంచి గుట్టుచప్పుడు కాకుండా రవాణా చేస్తున్న డ్రగ్స్‌ను నగరంలో విక్రయించేందుకు యత్నిస్తున్న ఒక నైజీరియన్ దేశస్తుడితో పాటు మరో ఇద్దరు వ్యక్తులను టీజీన్యాబ్, నార్సింగి పోలీసులు సంయుక్తంగా కలిసి పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి రూ.30లక్షల విలువ చేసే 107గ్రాముల కొకైన్, 25గ్రాముల ఎస్టసీ డ్రగ్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. సోమవారం రాజేంద్రనగర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ చింతమనేని శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. నైజీరియా దేశానికి చెందిన మ్యాక్స్ అలియాస్ ప్రిన్స్‌వెల్ అలియాస్ బుచ్చి అలియాస్ గాబ్రియెల్ స్వదేశం నుంచే డ్రగ్ మాఫియాను నడిపిస్తున్నాడు. స్టూడెంట్ వీసాలు, నకిలీ గుర్తింపు కార్డులతో తన అనుచరులను వివిధ దేశాలకు పంపించి డ్రగ్స్ దందా నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలోనే మ్యాక్స్ అనుచరుడైన చుకుమేక విస్డమ్ అన్‌యేక అలియాస్ విక్టర్ చుకు అలియాస్ చుకు ఎమెక డివైన్ 2022 డిసెంబర్ 26న స్టూడెంట్ వీసాపై సుడాన్ దేశస్తుడిగా చుకు విక్టర్ పేరుతో భారత్‌లోకి అడుగు పెట్టాడు. అప్పటి నుంచి దేశంలోని వివిధ రాష్ట్రాలకు డ్రగ్స్ సరఫరా చేస్తున్నాడు. కాగా డ్రగ్స్‌కు బానిసలైన మణికొండ ప్రాంతానికి చెందిన గోపిశెట్టి రాజేశ్, బొమ్మ దేవర వీర రాజులు గోవాలో డ్రగ్స్ కొనుగోలు చేస్తున్న క్రమంలో చుకు ఎమేక విస్డమ్‌తో పరిచయం ఏర్పడింది. డ్రగ్స్ విక్రయాలతో పెద్ద మొత్తంలో సంపాదించవచ్చునే దురాశతో చుకు ఎమేకతో కలిసి డ్రగ్స్ విక్రయాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో 2023లో ముగ్గురు నిందితులు కొకైన్ విక్రయిస్తూ రాయదుర్గ పోలీసులకు పట్టుబడి జైలు శిక్ష అనుభవించారు. అయినా వారి ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈనెల 22న మణికొండలోని అల్కాపురి టౌన్‌షిప్ వద్ద డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు టీజీన్యాబ్, నార్సింగి పోలీసు బృందాలు సంయుక్తంగా దాడులు జరిపి డ్రగ్స్ సరఫరా చేస్తున్న చుకు ఎమేకతో పాటు రాజేశ్, వీరరాజులను పట్టుకుని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.30లక్షల విలువ చేసే 107గ్రాముల కొకైన్, 25గ్రాముల ఎస్టసీ మాత్రలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఇదిలా ఉండగా 2022లో సుడాన్ దేశస్తుడిగా నకిలీ పాస్‌పోర్టుతో భారత్‌లోకి ప్రవేశించిన చుకు ఎమేక 2023లో నైజీరియన్ దేశం నుంచి పాస్‌పోర్టు పొందాడు. 2024, నవంబర్‌లో స్వదేశానికి తిరిగి వెళ్లి, సుడాన్ పాస్‌పోర్టును ధ్వంసం చేశాడు. తిరిగి 2024 డిసెంబర్ 13న నైజీరియన్ పాస్‌పోర్ట్‌పై తన నిజమైన పేరుతో భారత్‌లోకి ప్రవేశించాడు. గత నెల 29న మొయినాబాద్‌లోని అజీజ్‌నగర్‌లో జరిగిన రేవ్‌పార్టీకి సైతం ఇతనే రాజేశ్ ద్వారా కొకైన్‌ను సరఫరా చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది.

క్యాబ్ డ్రైవర్‌కు టోకరా..

పోచారం, జూన్ 23 : ఢిల్లీ పోలీసుల పేరుతో కాబ్ డ్రైవర్‌కు సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. ఈ సంఘటన పోచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. పోచారంలోని కాకతీయ నగర్‌లో నివాసం ఉంటున్న క్యాబ్ డ్రైవర్ ఎస్.మధుసూదన్ రెడ్డికి.. ఓ మహిళ నుంచి వీడియో కాల్ వచ్చింది. ఇది గమనించి కట్ చేసిన బాధితుడికి పలుమార్లు ఫోన్లుచేసి ఢిల్లీ పోలీసులమని, తమకు వచ్చిన వీడియో కాల్ వైరల్ అవుతుందని, కొంత డబ్బు చెల్లిస్తే డిలీట్ చేయిస్తామ ని అన్నారు. భయపడిన బాధితుడు మే 6న రూ.93000వేలు, మే 7న మరో రూ. 30000 పంపాడు. అనంతరం మోసపోయానని తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉన్నది.

తక్కువ ధరకే బంగారమంటూ మోసం

డబ్బులు తీసుకుని ఖాళీ బ్యాగ్ ఇచ్చిన ముఠా

పోలీసులకు ఫిర్యాదు.. ముఠా నాయకుడు అరెస్ట్

రూ. 40 లక్షల నగదు, క్రెటా కారు స్వాధీనం

సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్ జోన్ డీసీపీ డాక్టర్ బాలస్వామి

సుల్తాన్ బజార్, జూన్ 23 : తక్కువ ధరకే బంగారం ఇస్తామంటూ నమ్మించి మోసానికి పాల్పడుతున్న అంతర్రాష్ట్ర అటెన్షన్ డైవర్షన్ ముఠా నాయకుడిని అప్జల్‌గంజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి రూ.40లక్షల నగదును స్వాధీనం చేసుకోగా, మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. ఈ మేరకు సోమవారం డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ బాలస్వామి.. ఈస్ట్ జోన్ అదనపు డీసీపీ నరసయ్య, సుల్తాన్‌బజార్ ఏసీపీ మట్టయ్య, అప్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ రవి, డీఐ రవి కిరణ్‌లతో కలిసి వివరాలు వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం, రాయచూరు జిల్లా, మాన్వి గ్రామానికి చెందిన జయ కుమార్ (50) రోప్ బిజినెస్ వ్యాపారం చేస్తుంటాడు. అదే జిల్లా ముద్గల్ ప్రాంతానికి చెందిన ఉదయ్ (35), సందీప్ (24)లతో కలిసి ముఠాను ఏర్పాటు చేశాడు. సగం ధరకు అసలు బంగారం ఇస్తామంటూ బాధితులను దృష్టి మళ్లించి మోసాలకు పాల్పడుతున్నారు. ఇందులో భాగంగానే జయకుమార్.. మార్చి 20న చౌటుప్పల్ భరత్‌నగర్ కాలనీకి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి మునుకుంట్ల నిరంజన్‌కు ఫోన్ చేశాడు. తన పేరు రెడ్డి అని.. అసలైన బంగారాన్ని సగం ధరకే అమ్ముతానంటూ నమ్మించాడు. తరచూ ఫోన్‌లు చేస్తుండడంతో నిరంజన్.. వ్యాపార భాగస్వామి, స్నేహితుడు ధర్మేందర్, సాయిలకు చెప్పాడు. ఈ ముగ్గురు.. పెద్ద అంబర్‌పేట్‌లో రెడ్డి, అతని సహచరుడు రఘుతో బంగారం కొనుగోలు ఒప్పందం కుదుర్చుకున్నారు. మే 12న ఉదయం 10.00 గంటలకు నగదుతో దిల్‌సుఖ్‌నగర్‌కు రావాలని రెడ్డి(జయకుమార్) కోరారు. దీంతో నిరంజన్ స్నేహితులతో కలిసి కారులో రూ.65 లక్షల నగదుతో అక్కడికి వచ్చారు. రెడ్డి గ్యాంగ్.. మధ్యాహ్నం 1:30 గంటకు వారిని పుత్లీబౌలి క్రాస్‌రోడ్ మీదుగా అప్జల్‌గంజ్‌కు తీసుకెళ్లారు. పుత్లీబౌలి లోని ఇరానీ చాయ్ ఎదురుగా ఉన్న ఆటో స్టాండ్ దగ్గర రూ.65 లక్షలు ఉన్న బ్యాగ్‌ను తీసుకుని, వారికి బంగారం ఉన్న బ్యాగ్ ఇచ్చారు. కొద్ది దూరం వెళ్లిన తర్వాత నిరంజన్.. బంగారం ఉన్న బ్యాగ్‌ను చూడగా అందులో రాళ్లతో చుట్టబడిన చీరలు ఉన్నాయి. వెంటనేవారు రెడ్డికు కాల్‌చేయగా స్విచ్‌ఆఫ్ అని వచ్చింది. దీంతో నిరంజన్ అప్జల్‌గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తును ప్రారంభించారు. సాంకేతిక, సీసీటీవీ ఫుటేజ్‌ల ఆధారంగా నిందితులు జయ కుమార్, ఉదయ్, సందీప్‌లు కర్ణాటక, రాయచూర్ జిల్లాకు చెందినవారని గుర్తించారు. ఈ నెల 22న ఉదయం 10:30 గంటలకు ప్రధాన ముఠా నాయకుడు జయ కుమార్‌ను సీబీఎస్ సమీపంలో అరెస్టు చేసి, అతడి నుంచి రూ.40 లక్షల నగదు, క్రెటా కారును స్వాధీనం చేసుకున్నారు. పరారీలో మరో ఇద్దరు నిందితుల కోసం గాలిస్తున్నారు.

ఈ సమావేశంలో డీఎస్ఐ రామ్ కిషన్, క్రైమ్ హెడ్ కానిస్టేబుల్ ఎండీ యాసిన్ షరీఫ్, శ్రీకాంత్ బిడ్లా, పీసీలు జితేందర్, ఎండీ సులేమాన్, శ్రీకాంత్, విశాల్ కుమార్‌లు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

మూసాపేట, జూన్ 23: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. ఈ సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలో అమిత్ కరణ్..భార్య కృతిక, కుమారుడు మాధవ్, తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నారు. వీరంతా కలిసి తుల్జాపూర్ నుంచి హైదరాబాద్‌కు కారులో వస్తుండగా కూకట్‌పల్లి సౌత్ ఇండియా షాపింగ్ మాల్ మెట్రో పిల్లర్ నెంబర్ 761 వద్దకు రాగానే కారు బ్రేక్ డౌన్ అయింది. కుటుంబ సభ్యులు కారు దిగుతుండగా మియాపూర్ నుంచి అతివేగంగా వచ్చిన బొలెరో వాహనం వారిని ఢీకొట్టడంతో అమిత్ కుటుంబ సభ్యులు తీవ్ర గాయాలపాలయ్యారు. వెంటనే స్థానికులు స్థానిక పోలిక్లినిక్ ఆస్పత్రికి తరలించగా డ్యూటీ డాక్టర్లు పరీక్షించి కృతిక(30) మృతి చెందినట్లు తెలిపారు. మిగతా కుటుంబ సభ్యులను మెరుగైన వైద్యం కోసం యశోద ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కూకట్‌పల్లి పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వాహన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు

ఓఆర్ఆర్ మీదుగా గంజాయి రవాణా..

నిందితుడు అరెస్ట్..

120.17 కిలోలు స్వాధీనం

దుండిగల్, జూన్ 23: విశాఖపట్నం నుంచి హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా గంజాయి రావాణా చేస్తున్న వ్యక్తిని దుండిగల్ పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడి నుంచి రూ.45 లక్షల విలువచేసే 120.17 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం దుండిగల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి వివరాలు వెల్లడించారు. ఈ నెల 22న ఏపీలోని విశాఖపట్నం నుంచి హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా హర్యాన రాష్ట్రానికి గంజాయిని తరలిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న మేడ్చల్ ఎస్ఓటీ, దుండిగల్ పోలీసులు సంయుక్తంగా ఓఆర్ఆర్ ఎగ్జిట్ 5 (దుండిగల్ గేట్)వద్ద తనిఖీలు చేపట్టారు. సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో టాటా నెక్సాన్ కారు (ఏపీ 40, డీఎం8365) రాగా దాన్ని తనిఖీ చేయగా 43 ప్యాకెట్లలో 120.17 కిలోల గంజాయి లభించింది. దీని విలువ సుమారు రూ.45 లక్షల వరకు ఉంటుంది. కారులో ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా.. తాను కర్ణాటక రాష్ట్రం, గుల్బర్గా జిల్లా, సేవాలాల్ మందిర్ ప్రాంతానికి చెందిన సాగర్ పవార్‌గా పేర్కొన్నారు. నిందితుడిని అరెస్ట్‌చేసి, గంజాయి, కారు, 5 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరో నలుగురు నిందితులు దేవరాజ్, భజరంగ్, హనుమంతు పవార్, రాజకుమార్‌లు పరారీలో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఓటీ డీసీపీ, ఏసీపీ, మేడ్చల్ ఏసీపీతో పాటు పలువురు సీఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి..

విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాలు

సిటీబ్యూరో, జూన్ 23 (నమస్తే తెలంగాణ): నగరంలోని పలు విద్యాసంస్థల్లో హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ హెచ్‌న్యూ సోమవారం యాంటీడ్రగ్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ నిర్వహించింది. టాస్క్‌ఫోర్స్, హెచ్‌న్యూ డిప్యూటీ కమిషనర్ వైవీఎస్ సుధీంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డ్రగ్స్ వినియోగం వల్ల జరిగే అనర్థాలు, డ్రగ్స్ లేకుండా హాయిగా ఎలా జీవనం గడపాలో తెలిపారు. సంతోష్‌నగర్‌లోని వేద డిగ్రీకాలేజిలో జరిగిన అవగాహన సదస్సులో హాజరైన విద్యార్థులను ఉద్దేశించి సుధీంద్ర మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితాల్లో డ్రగ్స్ ఎలా ప్రభావితం చేస్తాయో చెప్పి వాటికి దూరంగా ఉండాలని, విద్యాసంస్థల్లోకి అటువంటి ప్రభావం పడకుండా చూడాలన్నారు. డ్రగ్స్ వల్ల విద్యార్థుల బంగారు భవిష్యత్ దెబ్బతింటుందని, కేసులతో ఇబ్బందులు పడడమే కాకుండా ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని, సమాజంలో మనకున్న సంబంధాలు మొత్తం కట్ అయిపోతాయని చెప్పారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండడంతోపాటు అవి వాడే వారి విషయంలో జాగ్రత్తగా ఉండాలని సుధీంద్ర సూచించారు. న్యూ ఎరా ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగిన హెచ్‌న్యూ ఇన్‌స్పెక్టర్ జీఎస్ డానియల్ విద్యార్థులకు యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించగా, అల్కాపురిలోని హోలీమేరీ కాలేజి ఆఫ్ నర్సింగ్‌లో హెచ్‌న్యూ ఇన్‌స్పెక్టర్ బి.బాలస్వామి.. విద్యార్థులను డ్రగ్స్ ఎలా ఆకర్షిస్తున్నదో వివరించి వాటిని అలవాటు చేసుకుంటే ఎలాంటి దుష్పరిణామాలు ఉంటాయో వివరించారు. హెచ్‌న్యూ యాంటీడ్రగ్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌కు విద్యాసంస్థల యాజమాన్యాలు సహకరించి విద్యార్థుల్లో అవగాహన కల్పించడాన్ని అభినందించారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉన్న విద్యాసంస్థల్లో రెగ్యులర్‌గా ఇటువంటి అవగాహన కార్యక్రమాలు చేపడుతామని డీసీపీ సుధీంద్ర తెలిపారు.

యాంటీడ్రగ్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌లో టాస్క్‌ఫోర్స్, హెచ్‌న్యూ డీసీ వైవీఎస్ సుధీంద్ర

ఎన్‌డీపీఎల్, నకిలీ మద్యంపై నిఘా పెట్టండి

బోనాల జాతర సందర్భంగా తనిఖీలు ముమ్మరం చేయాలి

ఇతర ప్రాంతాల నుంచి మద్యం రవాణా కాకుండా చర్యలు తీసుకోవాలి

రంగారెడ్డి జిల్లా ఆబ్కారీ డివిజన్ సమీక్షా సమావేశంలో డీసీ దశరథ్

సిటీబ్యూరో, జూన్ 23 (నమస్తే తెలంగాణ): రానున్న బోనాల జాతరలో నాన్‌డ్యూటీ పెయిడ్, నకిలీ మద్యం విక్రయాలు జరగకుండా నిఘా పెట్టాలని రంగారెడ్డి డివిజన్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నాంపల్లిలోని ఆబ్కారీ భవన్‌లో నిర్వహించిన రంగారెడ్డి డివిజన్ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తరలిస్తున్న ఎన్‌డీపీఎల్ మద్యంవల్ల ఆబ్కారీ ఖజానాకు గండిపడటమే కాకుండా పెద్ద ఎత్తున ప్రజల ప్రాణాలకు హాని కలిగించే నకిలీ మద్యం కూడా సరఫరా జరుగుతుందన్నారు. ఈ రెండింటిని అరికడితేనే ఆబ్కారీ ఖజానాకు గండిపడకుండా చేయగలమన్నారు. ముఖ్యంగా ఢిల్లీ, హర్యానా, గోవా, తదితర ప్రాంతాల నుంచి హైదరాబాద్ , రంగారెడ్డి జిల్లాల ప్రాంతాలకు పెద్ద ఎత్తున ఎన్‌డీపీఎల్ మద్యం సరఫరా జరుగుతుందన్నారు. దీనిని అరికట్టేందుకు హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెట్టడంతోపాటు చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి, తనిఖీలు నిర్వహించాలని అధికారులను డీసీ ఆదేశించారు. ఎన్‌డీపీఎల్, నకిలీ మద్యం అరికట్టేందుకు ఎక్సైజ్ సిబ్బందితో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్, డీటీఎఫ్ బృందాలు రంగంలోకి దిగి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రాబోయే బోనాల జాతరలో మద్యం వినియోగం అధికంగా ఉంటుందని, దీనిని ఆసరాగా చేసుకుని మద్యం మాఫియాలు పెద్ద ఎత్తున ఎన్‌డీపీఎల్, నకిలీ మద్యం సరఫరా చేసే అవకాశాలున్నాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని అధికారులు తనిఖీలు ముమ్మరం చేయాలని, గతంలో ఎన్‌డీపీఎల్, నకిలీ మద్యం రవాణా, సరఫరా, విక్రయాలకు పాల్పడిన పాత నేరస్తుల కదలికలపై నిఘా పెట్టాలని సూచించారు. దీంతో పాటు కోర్టు కేసులు, వాహనాల డిస్పోజల్, కేసుల్లో చార్జిషీట్స్ వేయడం, నిందితులను అరెస్ట్ చేయడం వంటి రోజువారి కార్యకలాపాలను పారదర్శకంగా, నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్, మల్కాజిగిరి, మేడ్చల్, సరూర్‌నగర్, వికారాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు కె.విజయ్, ఎన్.కె.ఫయాజోద్దీన్, ఉజ్వలారెడ్డి, విజయ భాస్కర్‌గౌడ్, ఏఈఎస్ జీవన్ కిరణ్‌తోపాటు ఏఈఎస్‌లు, సీఐలు, ఎన్‌ఫోర్స్‌మెంట్, డీటీఎఫ్ అధికారులు పాల్గొన్నారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీసీ దశరథ్

సైఫాబాద్ పోలీసులకు అభినందన

సిటీబ్యూరో, జూన్23(నమస్తే తెలంగాణ): డయల్ 100కు కాల్ చేసిన వెంటనే స్పందించి పోగొట్టుకున్న బ్యాగును యజమానికి అప్పగించిన సైఫాబాద్ పోలీసులను నగర సీపీ సీవీ ఆనంద్ అభినందించారు. సోమవారం ఉదయం లక్డీకాపూల్ బస్‌స్టాప్ నుంచి ఒక బ్యాగు పోయిందంటూ డయల్ 100కు సమాచారం రాగా అప్రమత్తమైన పోలీసులు తనిఖీ నిర్వహించి పోగొట్టుకున్న బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. అందులో 8తులాల బంగారం, రూ.15000 నగదు, మొబైల్‌ఫోన్, విలువైన వస్తువులు ఉన్నాయి. స్వాధీనం చేసుకున్న బ్యాగును సంబంధిత యజమానికి అప్పగించారు. ఈ సందర్భంగా సైఫాబాద్ పీఎస్ పెట్రోకార్ 1లో పనిచేస్తున్న కానిస్టేబుల్ విజయ్‌కుమార్, పురుషోత్తంకుమార్‌లను సీవీ ఆనంద్ నగదు బహుమతితో సత్కరించి ప్రోత్సాహక సర్టిఫికెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సైఫాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ పాల్గొన్నారు.

హైడ్రా ప్రజావాణికి 52 ఫిర్యాదులు

సిటీబ్యూరో, జూన్ 23 (నమస్తే తెలంగాణ): తమ ప్రాంతాల్లో చెరువులు, నాలాలు, పార్కుల ఆక్రమణలపై హైడ్రా ప్రజావాణికి పలువురు ఫిర్యాదు చేశారు. సోమవారం బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పలు ప్రాంతాల నుంచి 52 ఫిర్యాదులు వచ్చాయి. మియాపూర్‌లోని హెచ్ఎంటీ స్వర్ణపురి కాలనీలో రహదారిని కబ్జా చేసి ప్రహారీ నిర్మించారని, ఇప్పుడు తాత్కాలిక షెడ్స్ వేసి కిరాయిలకు ఇస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. మేడ్చల్ జిల్లా అల్వాల్ పరిధిలోని రిట్రీట్ కాలనీలో నాలా ఆక్రమణ జరిగిందంటూ నివాసితులు ఫిర్యాదు చేశారు. లయోలా కాలేజి సమీపంలో నాలాపై ఓయో గదులు నిర్మించడంతో పాటు బహుళ అంతస్తుల భవనం కూడా నిర్మించారని వారు పేర్కొన్నారు. శేరిలింగంపల్లి కొండాపూర్‌లోని కాంతి వనం కాలనీలో 2220 గజాల పార్కును ఆక్రమించేందుకు కబ్జాదారులు ప్రయత్నిస్తున్నారని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం, కోహెడ గ్రామ పరిధిలోని 13 ఎకరాల పిట్టె చెరువును మాయం చేస్తున్నారని స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులను స్వీకరించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్.. గూగుల్ మ్యాప్స్ ద్వారా ఫిర్యాదుల పరిస్థితిని పరిశీలించి, సంబంధిత ప్రాంతాల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

వివాహిత ఆభరణాలు అపహరణ



వెంగళరావునగర్, జూన్ 23 : వివాహితపై దాడి చేసి బంగారు ఆభరణాలు దోచుకెళ్లాడు. ఈ ఘటన ఎస్ఆర్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం .. స్టేషన్ పరిధిలోని తులసీనగర్‌లో నివాసం ఉండే వివాహిత(27)కు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్తతో విభేదాలు రావడంతో దూరంగా ఉంది. ఆ సమయంలో దుర్గాప్రసాద్ అనే వ్యక్తి ఆమెకు పరిచయమయ్యాడు. ఇటీవల కుటుంబ కలహాలు సమసిపోయి భర్తతో కలిసి కాపురం చేసుకుంటుంది. అయితే.. కోరిక తీర్చాలని ఆమెను దుర్గాప్రసాద్ వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈనెల 20న మధ్యాహ్నం భర్త ఇంట్లో లేని సమయంలో దుర్గాప్రసాద్ వచ్చి ఆమెపై దాడి చేసి బంగారు చైన్, బంగారు ఉంగరాన్ని లాక్కెళ్లాడు. ఆదివారం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చేవెళ్ల డిక్లరేషన్ హామీని మరిచారా ?

ఖైరతాబాద్, జూన్ 23 : ఎస్సీలోని అత్యంత వెనుకబడిన 57 ఉపకులాల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వెనుకబడిన ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బైరి వెంకటేశం కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గడుస్తున్నా మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు దళితుల్లో అత్యంత వెనుకబడిన 57 ఉపకులాల కార్పొరేషన్ నేటికి ఏర్పాటు చేయకపోవడం సరికాదన్నారు. ఎస్సీ వర్గీకరణ ప్రకారం గ్రూప్ 1, 2, 3 వారీగా కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తే గ్రూప్ 1లో ఉన్న 15 కులాలకు ఒక్కశాతం సరిపోకపోగా, గ్రూప్-2లో ఉన్న 17 కులాలు, గ్రూప్ -3లో ఉన్న 25 కులాలు మాల, మాదిగ కులాలతో కలిసి ఉండడం వల్ల అత్యంత వెనుకబడిన ఎస్సీ కులాలు తీవ్రంగా నష్టపోతాయన్నారు. చేవెళ్ల డిక్లరేషన్‌లో ఇచ్చిన ఈ హామీని ప్రభుత్వం విస్మరించిందని, తక్షణమే ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని లేని పక్షంలో తమ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశంలో శోభా మహర్, నర్సయ్య చిందు, నాగయ్య స్వామి, బైండ్ల యాదగిరి, పరమేశ్వర్ మాంగ్, రామారావు డక్కలి, యాదగిరి హొళియాదాసరి, సురేశ్, విజయ్, బైండ్ల నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో అభివాదం చేస్తున్న సమితి ప్రతినిధులు

కేసీఆర్ వీరాభిమాని శివకుమార్‌దాస్ అకాల మృతి

తెలంగాణ రాష్ట్ర తొలి ప్రభుత్వ ప్లీడర్‌గా బాధ్యతలు

అశ్రునివాళి అర్పించిన మాజీ చైర్మన్ రంగారావు, తదితరులు

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జూన్ 23 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఏర్పాటైన న్యాయవాదుల జాయింట్ యాక్షన్ కమిటీలో సభ్యుడిగా, కేసీఆర్ వీరాభిమానిగా, మాజీ ప్రభుత్వ ప్లీడర్‌గా సేవలందించిన ప్రముఖ న్యాయవాది పి.శివకుమార్‌దాస్ (57) అకాల మృతి చెందడంతో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి మాజీ చైర్మన్ తన్నీరు రంగారావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయన మరణం న్యాయవాద సంఘాల్లో తీవ్ర విషాదాన్ని కలిగించిందని, సిటీ సివిల్ కోర్టుకు చెందిన న్యాయవాదులతో పాటు ఇతర కోర్టులకు చెందినవారు సోమవారం ఆయన అంతిమయాత్రలో అధిక సంఖ్యలో పాల్గొన్నారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలి ప్రభుత్వ ప్లీడర్‌గా బాధ్యతలు నిర్వర్తించారని కొనియాడారు. ఆయన సేవలు న్యాయవాద వృత్తికి, తెలంగాణ ఉద్యమానికి చిరస్మరణీయంగా నిలిచిపోతాయన్నారు. తీవ్ర అస్వస్థతకు గురై గుండెపోటుతో హఠాన్మరణం చెందారన్నారు. హైదరాబాద్‌లోని పూల్‌బాగ్ ప్రాంతంలో భార్య, కూతురు, కుమారుడితో నివాసం ఉంటున్నారన్నారు. బీఆర్ఎస్ లీగల్‌సెల్ సభ్యులు మాణిక్ ప్రభుగౌడ్, తిరుమల్ రావు, కొంతం గోవర్ధన్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, ఆలుగడ్డల అనిల్, ఉపేందర్, లక్ష్మణ్‌గంగా, సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నవీన్, ప్రధాన కార్యదర్శి అజటే, ఉపాధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, సభ్యులు దిగ్భ్రాంతి వ్యక్తం చేసి ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

జ్యోతిష్యం

★ మీ ఇంట్లో ఏవైనా సమస్యలా? వెంటనే మాతాజీని కలవండి... లేదా సంప్రదించండి... 100% మీ సమస్యలు పరిష్కరింపబడతాయి... నమ్మకంతో రండి. మా సర్వీసెస్: ప్రేమవివాదాలు, భార్యాభర్తల వివాదాలు, అత్తాకోడళ్ల గొడవలు, వ్యాపార సంబంధిత గొడవలు లేక నష్టాలు, భూవివాదాలు, కోర్టుకేసులు, శత్రువులచే నష్టపోవడం లేదా ప్రయోగం చేయబ